
సాక్షి
నిర్మల్
గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



కడెం మరమ్మతులకు నిధులొచ్చాయ్

కడెం ప్రాజెక్టు మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5.46కోట్లు నిధులు మంజూరు చేసింది. గత నెల 29వ తేదీన ఇందుకు సంబంధించిన జీవో జారీ చేసింది. 8లో▸

ఈవీఎంల తనిఖీ చేపట్టాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఎంపీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 5నుంచి మొదటి విడత ఈవీఎంల తనిఖీ చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల అదనపు ప్రధాన అధికారి లోకేశ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో గూగుల్ మీట్ నిర్వహించారు. ఈవీఎంలు, వినియోగంపై సూచనలు చేశారు. అదనపు కలెక్టర్లు కిశోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, రిటర్నింగ్ అధికారులు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, జీవాకర్‌రెడ్డి, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0 / 19.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చలి కొనసాగుతుంది. రాత్రివేళ పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

బాసరకు రావాలని మంత్రి సురేఖకు ఆహ్వానం



మంత్రిని సన్మానిస్తున్న ఆలయ అధికారులు

భైంసా: ఈనెల 12నుంచి 14వ తేదీ వరకు బాసరలో నిర్వహించనున్న వసంత పంచమి వేడుకలకు హాజరు కావాలని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను ఆలయ అధికారులు బుధవారం హైదరాబాద్‌కు వెళ్లి ఆహ్వానించారు. శాలువాతో మంత్రిని సన్మానించి అమ్మవారి ప్రసాదం అందజేశారు. అనంతరం మంత్రి చేతుల మీదుగా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. మంత్రిని కలిసినవారిలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, అదనపు కమిషనర్ జ్యోతి, వరంగల్ జోన్ ఉప కమిషనర్ శ్రీకాంత్‌రావు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

పత్తి రైతుల పడిగాపులు



రోడ్డుపై నిలిచిన పత్తి వాహనాలు

భైంసా: సీసీఐ నిర్ణయంతో రెండు గంటల పాటు భైంసాలో పత్తి రైతులు పడిగాపులు కాశారు. కాటన్‌సీడ్ నిల్వలు పెరిగిపోయినందున ఈనెల 1నుంచి పత్తి కొనుగోళ్లు ఉండవని అధికారులు ప్రకటించారు. దీంతో బుధవారం ఉదయం నుంచే పట్టణంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు రైతులు పత్తి తీసుకువచ్చారు. గంటల తరబడి నిరీక్షించారు. సీసీఐ కేంద్రం నిర్వాహకులు ఉన్నతాధికారులతో చర్చించి రెండు గంటల అనంతరం కొనుగోళ్లు ప్రారంభించగా రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల్లో పత్తి, పత్తి గింజల నిల్వలు ఎక్కువైనందున భైంసా, కుభీర్ ఏఎంసీల పరిధిలోని జిన్నింగ్ మిల్లుల్లో ఫిబ్రవరి 1నుంచి 4వ తేదీ వరకు పత్తి కొనుగోళ్లు నిలిపివేయనున్నట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ ఓ ప్రకటనలో తెలిపారు. నిర్మల్ ఏఎంసీ పరిధిలోని జిన్నింగ్ మిల్లుల్లోనూ ఫిబ్రవరి 2నుంచి 4వ తేదీ వరకు కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు. తిరిగి కొనుగోళ్లు ఈ నెల 5వ తేదీ నుంచి యథావిధిగా కొనసాగుతాయని వివరించారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన



ప్రాజెక్టుపై ఎన్డీఆర్‌ఎఫ్ బృందం, అధికారులు

కడెం: ఎన్డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ (విజయవాడ) బృందం బుధవారం మండలంలో పర్యటించింది. ప్రకృతి వైపరీత్యాల బారి నుంచి ప్రాణాలు కాపాడుకునేలా బృందం సభ్యులు మండలంలోని పాండ్వపూర్ గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. వరదలు వచ్చినపుడు, అగ్ని ప్రమాదాలు జరిగినపుడు, ఇతర విపత్తులు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలిపారు. గుండెపోటు బారి నుంచి ప్రాణాలు రక్షించుకునేలా సీపీఆర్ ఎలా చేయాలో వివరించారు. అంతకు ముందు కడెం ప్రాజెక్టును సందర్శించి గతేడాది వచ్చిన వరదల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎన్డీఆర్‌ఎఫ్ టీం కమాండర్ ఇన్‌స్పెక్టర్ పింటు నంది, సభ్యులు రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో వెంకటేశ్వర్లు తదితరులున్నారు.


బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా చూడాలి



కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు

నిర్మల్‌టౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని బుధవారం న్యూఢిల్లీలో ఆదిలాబాద్ టు ఆర్మూర్ రైల్వే లైన్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్ టు ఆర్మూర్ రైల్వేలైన్ కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించి త్వరగా పనులు ప్రారంభించేలా చూడాలని కోరారు. కన్వీనర్ మనోజ్‌యాదవ్, కో కన్వీనర్లు యాటకారి సాయన్న, మూర్తి ప్రభాకర్, నిమ్మ గణేశ్, సయ్యద్ చాంద్‌పాషా తదితరులున్నారు.

కరుణించు కేంద్రమా..



- 'రైల్వేలైన్' అంశంపై వేగం పెంచాలి
- మంచిర్యాల–నిర్మల్–నాందేడ్ కావాలి
- ఎన్‌హెచ్ 63 విస్తరణ పనులు చేపట్టాలి
- జ్ఞానసరస్వతీ యూనివర్సిటీ ఇవ్వాలి
- ఈఎస్‌ఐ, నవోదయ ఏర్పాటు చేయాలి
- పురావస్తుశాఖ చర్యలు తీసుకోవాలి

నిర్మల్: 'గత పార్లమెంట్ ఎన్నికల్లో ఊహించని మెజార్టీతో బీజేపీని గెలిపించినం. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లోనూ నిర్మల్, ముధోల్ నియోజకవర్గాల్లో కమలం పార్టీకే పట్టం కట్టినం. కానీ.. జిల్లాకు మోదీ సర్కారు నుంచి ఆశించిన మేరకు ఫలాలు అందడం లేదు. త్వరలోనే రానున్న ఎంపీ ఎన్నికలకు ముందు ప్రవేశపెడుతున్న ఈ బడ్జెట్‌లోనైనా జిల్లాపై కరుణ చూపాలి..' అంటూ జిల్లావాసులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో కేంద్రంతో సంబంధమున్న పలు సమస్యలు, అంశాలను లేవనెత్తుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ రావడం, రెండు స్థానాల్లో బీజేపీ గెలవడంతో ఈసారి కేంద్రంపై మరింతగా ఆశలు పెరిగాయి.

జ్ఞానసరస్వతీ యూనివర్సిటీ కావాలె..

చదువులతల్లి కొలువైన నిర్మల్‌లో జ్ఞానసరస్వతీ అమ్మవారి పేరిట యూనివర్సిటీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఏళ్లుగా నలుగుతూనే ఉంది. ఇక్కడ ఉన్న కాకతీయ యూనివర్సిటీ పీజీ సెంటర్‌ను ఎత్తేశారు. అసలు ఆ యూనివర్సిటీయే జిల్లాకు దూరభారంగా ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్‌లోని బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాలకు మధ్యలో కేంద్రంగా ఉన్న నిర్మల్‌లో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో జ్ఞానసరస్వతీ యూనివర్సిటీ సాధన సమితి పేరిట డిమాండ్ వస్తూనే ఉంది. జిల్లాగా ఏర్పడిన తర్వాత నిర్మల్‌లో జనాభా విపరీతంగా పెరుగుతోంది. డిగ్రీ తర్వాత ఎలాంటి ఉన్నతవిద్య అందుబాటులో లేక ఏటా వందలాదిమంది హైదరాబాద్ వరకూ వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో గతంలో పాలకులు ఇచ్చిన హామీ మేరకు జ్ఞానసరస్వతీ విశ్వవిద్యాలయాన్ని కేంద్రం ప్రకటించాలని జిల్లా కోరుతోంది.



'పురావస్తు' పట్టించుకోవాలి



నిర్మల్ జిల్లా చారిత్రక నేపథ్యమున్న ప్రాంతం. వ్యాసుడి చేతులమీదుగా పూజలందుకున్న బాసర సరస్వతీనుంచి గౌతమబుద్ధుని శిష్యులున్న బాదన్‌కుర్తి వరకు ఎన్నో చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలున్నాయి. జిల్లాకేంద్రంలో 450ఏళ్ల క్రితపు ఆనవాళ్లు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. ఇలాంటి ఎన్నో పురావస్తు ప్రదేశాలను సంబంధిత శాఖ పట్టించుకోకపోవడంతో ఆక్రమణలకు గురవుతున్నాయి. సాక్షాత్తు జిల్లా కేంద్రంలోనే ఎన్నో బురుజులు, కందకాలు, గొలుసుకట్టు చెరువులు కబ్జాల పాలయ్యాయి. ఇప్పటికైనా కేంద్రం పురావస్తు శాఖ ద్వారా వీటిని కాపాడి అభివృద్ధి చేయాలి. ఇందుకు బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి.

'రైలు' రాక ఖరారు చేయాలె..



కలగానే మిగిలిన రైల్వేలైన్‌పై గతేడాది సెప్టెంబర్‌లో మళ్లీ కదలిక మొదలైంది. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సెప్టెంబర్ 3న పలు రైల్వేమార్గాలకు కేటాయించిన నిధులు వెల్లడించారు. అందులో ఆదిలాబాద్ నుంచి నిర్మల్–ఆర్మూర్–నిజామాబాద్–బోధన్–బాన్సువాడ–నిజాంపేట్–సంగారెడ్డి మీదుగా పటాన్‌చెరు వరకు రూ.5,706కోట్లతో రైల్వేలైన్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. మూడుదశాబ్దాల క్రితం ఆదిలాబాద్, నిర్మల్, ఆర్మూర్, డిచ్‌పల్లి మీదుగా పటాన్‌చెరు వరకు చేసిన రైల్వేలైన్ ప్రతిపాదన ఉంది. ఆ మార్గాన్నే మారుస్తూ నాలుగునెలల క్రితమే ప్రతిపాదనలు చేశారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం జాయింట్‌వెంచర్‌గా ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ లైన్‌కు ఒప్పుకొన్నప్పటికీ నిధుల విడుదలకు ముందుకు రాలేదు. దీంతో రాష్ట్రప్రభుత్వ ప్రమేయం లేకుండా కేంద్రమే కొత్త ప్రతిపాదన తీసుకువచ్చింది. కానీ.. గతంలోనూ ఈ రైల్వేలైన్‌పై అనేక ప్రతిపాదనలు, సర్వేలు చేసినప్పటికీ నిధుల మంజూరు, పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఇటీవలే చేసిన ప్రతిపాదనల ప్రకారం కేంద్రం ఈ బడ్జెట్‌లో ఎలాగైనా జిల్లా మీదుగా రైల్వేలైన్‌కు నిధులు కేటాయించాలని, దశాబ్దాల కల సాకారం చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు. అలాగే నాందేడ్ నుంచి నిర్మల్ మీదుగా మంచిర్యాల వరకు కొత్త లైన్‌కూ అవకాశం కల్పించాలని విన్నవిస్తున్నారు.

ఎన్నో ఆశలు..

బీజేపీ ఎంపీతో పాటు జిల్లాలో ఆ పార్టీకి తాజాగా ఇద్దరు ఎమ్మెల్యేలూ తోడయ్యారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర బడ్జెట్‌పై జిల్లా ఆశలు పెట్టుకుంది. పలు సమస్యలు, అభివృద్ధి పనులకు నిధులు ఆశిస్తోంది.

- జిల్లాలో ఇప్పటికీ కరెంట్ లేకుండా, ఉండీ లేనట్లుగా ఉన్న అటవీ గ్రామాలున్నాయి. వాటికి విద్యుత్‌కాంతులతో పాటు రోడ్డుమార్గాలను అందించాలి.
- కల్యాణి నుంచి నిర్మల్ వరకు ఉన్న ఎన్‌హెచ్ 63 రోడ్డును నాలుగులైన్లుగా విస్తరణ పనులు చేపట్టాలి.
- గతంలో జిల్లాలో ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు నిర్మల్‌లో ఈఎస్‌ఐ ఆస్పత్రి, భైంసాలో ఈఎస్‌ఐ డిస్పెన్సరీని ఏర్పాటు చేయాలి.
- కొత్త జిల్లాగా ఏర్పడ్డ నిర్మల్‌లో నవోదయ లేదా కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది.
- పత్తి, సోయా పంటలు ఎక్కువగా సాగయ్యే జిల్లాలో టెక్స్‌టైల్స్‌పార్క్, ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమలు నెలకొల్పాలి.
- పారిశ్రామికంగా వెనుకబడిన నిర్మల్‌లో ప్రజలు, రైతులకు ఇబ్బంది కలగకుండా పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం ప్రోత్సహించాలి.
- పర్యాటకంగా అభివృద్ధికి ఆస్కారం ఉన్న జిల్లాకు ఆ దిశగా నిధులు కేటాయించాలి.
- ఎన్‌హెచ్ 44, 63 రెండు రోడ్లకు కూడలిగా ఉన్న జిల్లాలో అన్ని సదుపాయాలతో కూడిన ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి.

ఇక్కడ అంతా రహస్యం!

- ఎవరికీ పట్టని ఆర్జీయూకేటీ
- లోపాలే విద్యార్థులకు శాపాలు..!
- సీఎం రాక కోసం ఎదురుచూపులు



ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారం

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ కళాశాలలో ఏమి జరిగినా బయటకు తెలియనీయడంలేదు. ఇక్కడి ఆంక్షలు విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. తొమ్మిదివేల మంది విద్యార్థులున్న యూనివర్సిటీలో పరిపాలన లోపాలు తరచూ వెలుగుచూస్తున్నాయి. అనుకోని రీతిలో ఏదైన ఘటన జరిగితే బయటకు రానీయడంలేదు. యూనివర్సిటీలో పారదర్శకత లోపించింది. యూనివర్సిటీ రహస్యాలు, పరిపాలన నిర్ణయాలు మాత్రం బయట పడుతున్నాయి.

తరచూ ఫుడ్‌పాయిజన్

ఇప్పటికే ఇక్కడి మెస్‌లలో పలుసార్లు ఫుడ్‌పాయిజన్‌తో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ట్రిపుల్‌ఐటీలో మీడియాపై ఇప్పటికీ ఆంక్షలు కొనసాగుతున్నాయి. వర్సిటీ నిబంధనల మేరకు పనిచేయాలని సిబ్బందికీ ఆంక్షలు విధించారు. ఏమి జరిగినా బయటకు తెలియనీయడంలేదు.

అమలు కాని హామీలు...

ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులు ఆందోళనకు దిగినప్పుడల్లా మంత్రులు రావడం హామీలు ఇవ్వడం పరిపాటిగా మారింది. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలే ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రతీసారి వచ్చి విద్యార్థులతో మాట్లాడి వెళ్లడం మినహా ఏమీ చేయడం లేదు. ఇక్కడ గ్రామీణ నేపథ్యం నుంచే వచ్చిన విద్యార్థులే ఎక్కువ సంఖ్యలో ఉంటారు. వీరిలో భయాన్ని పోగొట్టి చదువువైపు దృష్టి మరల్చలేకపోతున్నారు. ఆత్మహత్యలు జరిగినప్పుడల్లా అవగాహన సదస్సులు అంటూ నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు.

సీఎం రేవంత్‌పైనే ఆశలు

2008లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి బాసర ట్రిపుల్‌ఐటీని ప్రారంభించారు. అప్పట్లో ప్రత్యేక బడ్జెట్ కేటాయించారు. దీని సరిహద్దుకు ఆనుకుని ఆల్కహాల్ ఫ్యాక్టరీ ఉంది. ప్రస్తుతం ఇక్కడి వ్యర్థాలు విద్యార్థులను అస్వస్థతకు గురిచేస్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ట్రిపుల్‌ఐటీకి వస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని అంతా ఆశపడుతున్నారు. ట్రిపుల్‌ఐటీకి ప్రత్యేక కమిటీ వేయాలని కోరుతున్నారు. ప్రతిపక్షనేతగా అప్పట్లో సీఎం రేవంత్‌రెడ్డి ట్రిపుల్‌ఐటీని సందర్శించగా ఆంక్షల కారణంగా లోనికి వెళ్లనీయలేదు. సీఎం హోదాలో ఇక్కడికి వస్తేనే ట్రిపుల్‌ఐటీ సమస్యలు పరిష్కారమవుతాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భావిస్తున్నారు. ప్రత్యేకాధికారి రాకతోనైనా ట్రిపుల్‌ఐటీ రహస్యాలు బయటపడతాయో లేదో చూడాలి.

సీఎం సారూ.. సమస్యలివీ!



తుమ్మిడి హెట్టి వద్ద ప్రాణహితపై ప్రాజెక్టు నిర్మించాల్సిన ప్రాంతం (ఫైల్)

- పలు పెండింగ్ పనులపై ప్రజల వినతి
- ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై స్థానికుల ఆశలు
- రేపు ఇంద్రవెల్లికి సీఎం రేవంత్‌రెడ్డి రాక

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు వస్తున్న ఎనుముల రేవంత్‌రెడ్డిపై ఇక్కడి ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించి బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈ సభకు సంబంధించి అధికారులు, అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో సీఎం పర్యటన సందర్భంగా ఇక్కడి అభివృద్ధి కోసం నిధుల ప్రకటన, కొత్త పనుల కోసం హామీలు ఇవ్వాలని కోరుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో అనేక సమస్యలు ఉన్నాయి.

గిరిజనుల గోస

ఉమ్మడి జిల్లా ఏజెన్సీ పరిధిలో గిరిజనులకు ఇప్పటికీ అటవీ సమీప గ్రామాలకు సౌకర్యాల్లేవు. చాలా చోట్ల విద్య, వైద్యం, తాగునీరు, అన్ని కాలాల్లో రవాణాకు రోడ్లు అందుబాటులోకి తేవాల్సి ఉంది. ఇంద్రవెల్లి, నార్నూర్, జైనూర్, లింగాపూర్ మండలాల్లో వానాకాలాల్లో ఇప్పటికీ మట్టిరోడ్లే దిక్కవుతున్నాయి. పక్కా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. అటవీ అనుమతులు రాక పనులు ముందుకు సాగడం లేదు. ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక కేంద్రాలు, సామాజిక ఆస్పత్రుల్లో సరిపడా వైద్య సిబ్బంది లేక అరకొర వైద్యం అందుతోంది. ఏజెన్సీలో సౌకర్యాలు మెరుగుపర్చాల్సి ఉంది. జిల్లా కేంద్రాల్లో ప్రధాన ఆస్పత్రులతోపాటు ఆదిలాబాద్ రిమ్స్‌లోనూ సిబ్బంది ఖాళీలతో వైద్యంపై ప్రభావం పడుతోంది. ఉట్నూరు ఐటీడీఏను సమగ్రంగా ప్రక్షాళన చేయాల్సి ఉంది. నాలుగు జిల్లాల విస్తరణతో పరిపాలనలో సమస్యలు వస్తున్నాయి. ఆసిఫాబాద్‌లో మినీ ఐటీడీఏ ఏర్పాటు కార్యాచరణ దాల్చలేదు.

గిరిజనేతరులకు..

ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులకు ఉద్యోగ, ఉపాధి, విద్యాసంస్థల్లో అవకాశాలు తక్కువగా ఉన్నాయి. అటవీ హక్కుల చట్టం కింద గిరిజనులకు మాత్రమే పోడు పత్రాలు ఇవ్వడంతో గిరిజనేతరులకు సైతం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పోడు హక్కు పత్రాలు తమకు కూడా ఇవ్వాలని వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు.

సింగరేణి ప్రాంతంలో కార్మికులకు..

సింగరేణి ప్రాంతంలో కొత్త గనుల ప్రారంభం, ఓపెన్ కాస్టుల స్థానంలో భూగర్భ గనులు ప్రారంభించాలనే ప్రతిపాదనలు అటకెక్కాయి. దీంతో ఉపాధి అవకాశాలు తగ్గి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెరుగుతున్నారు.

మున్సిపాలిటీల్లో..

ఉమ్మడి జిల్లాలో నిర్మల్, భైంసా, ఖానాపూర్, ఆదిలాబాద్, కాగజ్‌నగర్, మంచిర్యాల, లక్సెట్టిపేట, నస్పూర్, చెన్నూరు, క్యాతనపల్లి, మందమర్రి, బెల్లంపల్లి పట్టణాలున్నాయి. వీటి పరిధిలో అనేక సమస్యలు ఉన్నాయి. పట్టణ వాసులకు తాగునీరు, రోడ్లు, మౌలిక వసతులు అరకొరగా అందుతున్నాయి. ఇక ఉట్నూరు, ఆసిఫాబాద్ మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ ఇంకా గ్రామ పంచాయతీలుగానే కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంగా ఉన్న ఆసిఫాబాద్‌కు మున్సిపాలిటీ హోదా దక్కలేదు. ఇక మందమర్రి పట్టణంలో ఏజెన్సీ వివాదంతో ఎన్నికలు జరగడం లేదు. ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు. ఇక గ్రామ పంచాయతీలకు నిధులు, సర్పంచులకు పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపు పూర్తి చేయాల్సి ఉంది.

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు

ఉమ్మడి జిల్లాలో సరైన సాగునీటి ప్రాజెక్టులు లేక ఇంకా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నీటి వనరులున్నా సమర్థవంతంగా ఉపయోగించుకోలేని పరిస్థితి నెలకొంది. ప్రధాన ప్రాజెక్టులైన కడెం, సరస్వతి కాలువ (ఎస్సారెస్పీ) ఆధునీకరించాల్సి ఉంది. మధ్యతరహా ప్రాజెక్టుల్లో స్వర్ణ, వట్టివాగు, సాత్నాల, ఎన్టీఆర్, పీపీ రావు ప్రాజెక్టు, గడ్డెన్నవాగు, సదర్మాట్ ఉన్నాయి. కుమురంభీం జిల్లా పరిధిలో కుమురంభీం ప్రాజెక్టు కాలువలు పూర్తి చేయాల్సి ఉంది. తాంసిలో మత్తడివాగు, పెన్‌గంగా ప్రాజెక్టు, హాజీపూర్ మండలం ముల్కల్లలోని ర్యాలీవాగు, వేమనపల్లి మండలం నీల్వాయి, భీమారంలో గొల్లవాగు ప్రాజెక్టులు ఉన్నాయి. గత కాంగ్రెస్ హయాంలో చేపట్టిన కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై ఉన్న డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ప్రాణహిత–చేవేళ్ల ప్రాజెక్టును బీఆర్‌ఎస్ ప్రభుత్వం పక్కన పెట్టింది. తాజా గా కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో ఈ ప్రాజెక్టుపై మళ్లీ ఆశలు పెరిగాయి. ఇక కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల పరిధిలో ప్రాణహిత, గోదావరి తీర ప్రాంత రైతుల పంటలు ఏటా నీట మునుగుతున్నాయి. వీటి కోసం శాశ్వత పరిష్కారం చూపాల్సి ఉంది. మంచిర్యాల, నస్పూర్ పట్టణాల్లో లోతట్టు ప్రాంతాలు వరదలు వచ్చి ముంపునకు గురవుతున్నాయి.

సీసీ కెమెరాలతో నేరాలు తగ్గుముఖం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

- ఎస్పీ జానకి షర్మిల
- సీసీ కెమెరాలు ప్రారంభం

నిర్మల్ రూరల్: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు తగ్గుముఖం పడతాయని ఎస్పీ జానకి షర్మిల పేర్కొన్నారు. మండలంలోని అక్కాపూర్ గ్రామంలో బుధవారం వీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రారంభించారు. అంతకుముందు రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా విద్యార్థులు చేపట్టిన ర్యాలీ ప్రారంభించారు. యువకులకు లయన్స్‌క్లబ్ సమకూర్చిన హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. బాగా చదువుకుని ఉన్నత రంగాల్లో స్థిరపడాలని విద్యార్థులకు సూచించారు. డీఎస్పీ గంగారెడ్డి, ఎంవీఐ అజయ్‌కుమార్‌రెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై చంద్రమోహన్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వట్టిమల్ల నర్సయ్య, ముజాపూర్ పీఏసీఎస్ అధ్యక్షుడు బోండ్ల గంగాధర్, సర్పంచ్ సుజాత, నాయకుడు పోశెట్టి, వీడీసీ అధ్యక్షుడు శివరాత్రి నగేశ్ తదితరులున్నారు.

నోటికి నల్లగుడ్డలతో నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

ఖానాపూర్: ప్రొఫెసర్ కోదండరాంపై బీఆర్‌ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ పట్టణంలోని జగన్నారావు చౌరస్తాలో బుధవారం నోటికి నల్లగుడ్డలు ధరించి ర్యాలీ నిర్వహించారు. టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు తిలక్‌రావు, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, కమలాకర్, లింగన్న, బెన్నీ, నాగేందర్, నరేశ్, శ్రీనివాస్, సంపత్‌రావు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నిర్మల్‌చైన్‌గేట్: మహిళా పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర పెన్షనర్స్ సంఘ భవనంలో మహిళా పెన్షనర్ల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 300 మందికి పైగా పుట్టిన తేదీలు తప్పుగా నమోదయ్యాయని, త్వరలో సరి చేయిస్తామని తెలిపారు. జిల్లా కోశాధికారి ప్రభాకర్‌రావు, నాయకులు హనుమంత్‌రెడ్డి, చందూలాల్ శ్రీవాస్తవ, గంగన్న, జనార్దన్, రమేశ్, సత్తెయ్య, రాములు పాల్గొన్నారు.

నర్సారెడ్డి కుమారులకు పరామర్శ

లక్ష్మణచాంద: ఇటీవల మాజీ మంత్రి నర్సారెడ్డి మృతి చెందగా అతడి కుమారులను బీఆర్‌ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి సత్యనారాయణగౌడ్ బుధవారం పరామర్శించారు. నర్సారెడ్డి అస్థికలను సోన్ గోదావరిలో కలపడానికి వచ్చిన ఆయన కుమారులు సుదర్శన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డిని సత్యనారాయణగౌడ్, నారాయణరెడ్డి కలిశారు. నాయకులు కృష్ణప్రసాద్‌రెడ్డి, దశరథ రాజేశ్వర్ తదితరున్నారు.

ఘనంగా మాతృ వందనం



తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుంటున్న విద్యార్థులు

కుంటాల: మండలంలోని పెంచికల్ పాడ్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం 'మాతృవందనం' కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తల్లిదండ్రుల కాళ్లు కడిగి ఆశీర్వాదం తీసుకున్నారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, చీరె, సారె పెట్టారు. సర్పంచ్ దిగంబర్ పటేల్, ఎంఈవో ముత్యం, హెచ్‌ఎంలు రాజేశ్వర్, ఎల్లన్న, బాబారావు, ఏఈవోలు గణేశ్, లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సారిక, ఆనందిత ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మణ్ తదితరులున్నారు.

సీఎం సభ సక్సెస్ చేయాలి



మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

భైంసాటౌన్: ఇంద్రవెల్లిలో ఈనెల 2వ తేదీన నిర్వహించనున్న సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ్‌రావు పటేల్ ఆధ్వర్యంలో పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. సభ విజయవంతం చేయాలని కోరారు.

ఇంద్రవెల్లి నుంచే ఎన్నికల శంఖారావం

నిర్మల్‌చైన్‌గేట్: ఇంద్రవెల్లి సభ నుంచే కాంగ్రెస్.. పార్లమెంట్ ఎన్నికల శంఖారావం పూరిస్తుందని మాజీ ఎమ్మెల్సీ అరిగెల నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో సభ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ 10 ఏళ్ల అధికారంలో ఉండి చేయలేని పనులను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే సగం హామీలు నెరవేర్చిందని చెప్పారు.

క్లుప్తంగా

బోథ్ ఎమ్మెల్యేకు మాజీ మంత్రి ఐకేరెడ్డి పరామర్శ


అనిల్ జాదవ్‌తో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఐకేరెడ్డి

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే చిన్న నాన్న కుమారుడు జాదవ్ అంబరావు ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. బుధవారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణరెడ్డి మండలంలోని రాజురా గ్రామంలోని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట బోథ్ నియోజకవర్గంలోని ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత..


పోలీసులు పట్టుకున్న పీడీఎస్ బియ్యం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ కాలనీలో అక్రమంగా నిల్వచేసిన తొమ్మిది క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. పట్టణ ఎస్సై శంకర్ వివరాల ప్రకారం... కాలనీకి చెందిన తాహెర్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ చేస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టగా తొమ్మిది క్వింటాళ్ల బియ్యం నిల్వ ఉండడంతో.. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా స్థావరంపై దాడి


గుడుంబాతో ఎక్సైజ్ అధికారులు

కడెం: మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామంలో గుడుంబా స్థావరాలపై బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన మునిగంటి గంగవ్వ ఇంటి వద్ద ఐదు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, వంద లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్ తెలిపారు. ఇందులో ఎక్సైజ్ సిబ్బంది ముత్యం, రషీద్, రవళి ఉన్నారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం


శిశువును అందిస్తున్న ఈఎంటీ సతీష్

బజార్‌హత్నూర్: మండలంలోని బలాన్‌పూర్ గ్రామానికి చెందిన గర్భిణి గంగాదేవికి బుధవారం ఉదయం పురిటి నొప్పులొచ్చాయి. కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో గుడిహత్నూర్ సమీపంలో పురిటినొప్పులు అధికమయ్యాయి. దీంతో పైలెట్ నరేందర్, ఈఎంటీ సతీష్ అంబులెన్సును రోడ్డు పక్కన నిలిపి ఈఆర్‌సీపీ డాక్టర్ మనీష్‌ను ఫోన్‌లో సంప్రదించి అతడి సూచనల మేరకు ప్రసవం చేశారు. పండంటి మగ బిడ్డను జన్మనిచ్చింది. వెంటనే రిమ్స్‌లో ఆరోగ్య పరీక్షలు చేయగా తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

సీఎం సభ విజయవంతం చేయాలి

- అధికారంలోకి వచ్చిన తరువాత ఇంద్రవెల్లిలో తొలి పర్యటన
- వెనుకబడిన ఉమ్మడి జిల్లాను అభివృద్ధి చేస్తాం
- అమరుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటాం
- పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క


అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఇంద్రవెల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫిబ్రవరి 2న ఉద్యమాల గడ్డ ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ గౌష్ ఆలాంలతో కలిసి కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. నాగోబా దర్బార్ హాల్‌లో సీఎం పర్యటనపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సభ ఏర్పాట్లను పరిశీలించారు. జల్ జంగల్ జమీన్ కోసం పోరాడి అసువులు బాసిన అమరుల జ్ఞానకార్థంగా కోటి రూపాయలతో నిర్మించే స్మృతివనం శంకుస్థాపన కోసం ఏర్పాట్లు చేయాలని


నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి

అధికారులకు సూచించారు. సీఎం మధ్యాహ్నం 1:30 గంటలకు నాగోబా ఆలయాన్ని దర్శించుకున్న అనంతరం దర్బార్‌హాల్‌లో 400మంది స్వయం సహాయక సంఘాల మహిళా సంఘాల


సభ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

సభ్యులతో సమావేశం నిర్వహిస్తారని, అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అలాగే అమరవీరుల స్తూపాన్ని సందర్శించి నివాళులర్పిస్తారని వివరించారు. అలాగే సీఎం పర్యటన ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం నుంచి ప్రారంభించనున్నట్లు చెప్పారు. వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై ప్రత్యేక అభిమానం ఉందని, అన్ని విధాలుగా జిల్లాను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. అభివృద్ధికి ముందడుగు ఇక్కడి నుంచే బాటలు పడుతాయన్నారు. రేవంత్‌రెడ్డి మొదటి సభ, బట్టి విక్రమార్క పాదయాత్ర ఈ జిల్లా నుంచే ప్రారంభించారని వివరించారు. అందుకే అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి సభ ఇంద్రవెల్లిలోనే నిర్వహించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ కట్టిన కడెం ప్రాజెక్టును పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని, ఇష్టానుసారంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ ప్రొఫెసర్ కోదండరాంను వాడుకున్నారని, ఉద్యమకారులకు గుర్తింపు లేకుండా కుట్రలు చేశారన్నారు. బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ కాదని, కల్వకుంట్ల కుటుంబ పార్టీ అని ఆరోపించారు. కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, డీఆర్డీవో పీడీ కిషన్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఉట్నూర్ ఆర్డీవో జీవకర్‌రెడ్డి, డీఎల్పీవో బిక్షపతిగౌడ్, నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, సర్పంచ్ మెస్రం రేణుక నాగ్‌నాథ్, మెస్రం వంశం ఉద్యోగస్తులు మనోహర్, శేఖర్‌బాబు, సోనేరావ్ ఉన్నారు.

బ్యాటరీ దొంగల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ పురుషోత్తం, పక్కన ఎస్సై శంకర్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో కొంతకాలంగా బ్యాటరీ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ పురుషోత్తం వివరాలు వెల్లడించారు. స్థానిక గాంధీనగర్‌లో వాహనాల బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలిస్తున్నారని అందిన సమాచారం మేరకు ఇటీవల కేసు నమోదు చేశారు. మంగళవారం రాత్రి పట్టణంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో నిందితులు చూసి తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఆటోను ఆపి తనిఖీ చేయగా అందులో ఆరు బ్యాటరీలు కనిపించాయి. వారిని విచారించగా పట్టణానికి చెందిన షాహీద్, సల్మాన్‌లు గతకొంత కాలంగా పలుచోట్ల బ్యాటరీలు దొంగతనం చేసి నిజామాబాద్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తున్నామని ఒప్పుకున్నారు. వీరి వద్ద నుంచి ఆరు బ్యాటరీలు, ఆటోను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిలించినట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న ఎస్సై శంకర్, ఐడీ పార్టీ పోలీసులను సీఐ అభినందించారు.

'కడెం'కు నిధులొచ్చాయి..



కడెం ప్రాజెక్ట్

- రూ.5.46 కోట్లు మంజూరు
- మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు చొరవతో..

కడెం: కడెం ప్రాజెక్ట్ మరమ్మతు పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. నిర్మల్, మంచిర్యాల జిల్లాల ప్రధాన సాగు నీటి ప్రాజెక్ట్ రెండేళ్లుగా భారీ వరదలతో దెబ్బతింది. గత ప్రభుత్వం ప్రాజెక్ట్ మరమ్మతులకు నిధులను విడుదల చేయకపోవడంతో దెబ్బతిన్న ప్రాజెక్ట్ మరమ్మతులకు నోచలేదు. ఇటీవల ప్రాజెక్ట్‌ను సందర్శించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యే బొజ్జు ప్రాజెక్ట్ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 29న ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జా కడెం ప్రాజెక్ట్ మరమ్మతులకు రూ.5.46 కోట్లు మంజూరు చేస్తున్నట్లు జీవో జారీ చేశారు.

రెండేళ్లుగా మరమ్మతులు నోచని వైనం..

కడెం ప్రాజెక్ట్‌కు 2022, 2023 వర్షాకాలంలో వచ్చిన భారీ వరదలకు వరద గేట్లు మొరాయించి ప్రాజెక్ట్ కొట్టుకుపోయో పరిస్థితి నెలకొన్న విషయం తెలిసిందే. మూడు వరద గేట్ల కౌంటర్‌వెయిట్ కొట్టుకుపోగా ఒక్క గేటుకు మాత్రమే కౌంటర్ వెయిట్ బిగించారు. భారీ వరదల కారణంగా స్పిల్‌వే, అడ్డు గోడలు దెబ్బతిన్నాయి. గత ఏడాది సెప్టెంబర్‌లో 15 నంబర్ వరద గేటు కౌంటర్ వెయిట్ గేటు ఎత్తే క్రమంలో విరిగిపడింది. దీంతో లక్షల క్యూసెక్కుల నీళ్లు వృథాగా గోదావరిలో కలిశాయి. వరద గేట్లకు


విరిగిన వరద గేటు కౌంటర్‌వెయిట్(ఫైల్)

సకాలంలో లీకేజీల మరమ్మతుల చేపట్టకపోవడంతో ప్రాజెక్ట్ నీటిమట్టం గతేడాది కంటే పది అడుగులు తగ్గింది. దీంతో ఈ ఏడాది యాసంగికి సాగుకు ఆయకట్టుకు నీరందించలేకపోయారు.

టెండర్ పూర్తయ్యేనా..?

ప్రభుత్వం నిధులను మంజూరు చేసిన సకాలంలో టెండర్ పూర్తయితే మరమ్మతులు చేపట్టే అవకాశం ఉంది. లేదంటే ఎలక్షన్ కోడ్‌తో జాప్యం ఏర్పడుతుంది. గత ఏడాది క్రితం మంజూరు చేసిన రూ.1.44 కోట్లకు టెండర్ ప్రక్రియ సకాలంలో పూర్తి కాక పనులు చేపట్టలేదు. దీంతో అడ్మిస్ట్రేషన్ పనులను పూర్తి చేసి టెండర్లు ఆహ్వానించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారు. సకాలంలో మరమ్మతు పనులు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. గతంలో విడుదల చేసిన రూ.1.44 కోట్లతో స్పిల్‌వే, అడ్డు గోడలు, ఇటీవల విడుదల చేసిన రూ.5.46 కోట్లతో రోప్స్, రోలర్స్, కౌంటర్‌వెయిట్స్ పనులు చేపట్టనున్నట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.

సకాలంలో మరమ్మతులకు చర్యలు



ఇటీవల కడెం ప్రాజెక్ట్ మరమ్మతులకు ప్రభుత్వం రూ.5.46 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎలక్షన్ కోడ్ సమీపించక ముందే టెండర్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. టెండర్ పూర్తి కాగానే పనులు ప్రారంభవుతాయి. – బోజదాసు, డీఈ

పనులు పూర్తి చేయాలి



రెండేళ్లుగా ప్రాజెక్ట్ మరమ్మతులకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నాం. ఈ యాసంగి నీటిని విడుదల చేయకపోవడంతో ఆయకట్టు కింద వందల ఎకరాలు బీళ్లుగా మారాయి. సకాలంలో మరమ్మతులు చేయించి ఆయకట్టు రైతాంగానికి అండగా నిలవాలి. – ముక్కెర గంగాధర్, రైతు, కొండుకూర్

పీఆర్‌లో ఎన్నికల బదిలీలు

- ఎంపీడీవోల నుంచి జెడ్పీ సీఈవో వరకు స్థానచలనం
- ప్రభుత్వానికి నివేదిక పంపిన కలెక్టర్
- స్థానికంగానే కొనసాగించాలంటూ మంత్రికి ఎంపీడీవోల విన్నపం

కైలాస్‌నగర్: పంచాయతీరాజ్ శాఖలో బదిలీల హడావుడి నెలకొంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆ శాఖలో మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్నవారు. స్థానిక జిల్లా వాసులైన వారిని బదిలీ చేయాల్సిందిగా ఈసీ ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 8వ తేదీలోగా ప్రక్రియను పూర్తి చేయాలనే ఆదేశాలతో జిల్లా అధికారులు కసరత్తు చేపట్టారు. అలాంటి వివరాలతో కూడిన జాబితాను సిద్ధం చేసి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించారు. వాటికి ఆమోదం లభిస్తే పంచాయతీరాజ్‌శాఖలో పనిచేసే జిల్లా స్థాయి అధికారుల నుంచి ఎంపీడీవోల వరకు పూర్తిగా బదిలీ కానున్నారు. వారి స్థానాల్లో ఇతర జిల్లాల నుంచి అధికారులు రానున్నారు. ఈసీ బదిలీలతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని భావిస్తున్న అధికారులు సమీపంలోని నిర్మల్, నిజామాబాద్ జిల్లాలకు వెళ్లేలా రాజకీయంగా పైరవీలు ప్రారంభించారు. తమను స్థానికంగానే కొనసాగించాలంటూ ఎంపీడీవోలు జిల్లాకు వచ్చిన ఇన్‌చార్జి మంత్రిని కలిసి వేడుకున్నట్లుగా సమాచారం.

జెడ్పీ సీఈవో నుంచి ఎంపీడీవో దాక...

ఈసీ ఆదేశాల ప్రకారంగా పరిశీలిస్తే జిల్లా పీఆర్‌శాఖలో పనిచేసే అధికారులంతా మూడేళ్ల సర్వీస్‌ను పూర్తి చేసుకున్నవారే ఉన్నారు. దీంతో జెడ్పీ సీఈఓ నుంచి ఎంపీడీవోల వరకు ఇతర ప్రాంతాలకు


జిల్లా పరిషత్ కార్యాలయం

బదిలీపై వెళ్లక తప్పని పరిస్థితి. సీఈఓ నిజామాబాద్ జిల్లా, డీఆర్‌డీఓ నిర్మల్ జిల్లాకు చెందిన వారైనప్పటికీ స్థానికంగా మూడేళ్ల సర్వీస్‌ను పూర్తి చేసుకున్నారు. డిప్యూటీ జెడ్పీ సీఈఓ, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఏపీడీ)లతో జిల్లాలో పనిచేసే 17మంది ఎంపీడీవోలు ఆదిలాబాద్ జిల్లా వాసులే. వీరిలో కొంతమంది ఒకే చోట 8ఏళ్లకు పైగా సేవలందిస్తున్నారు. బేలకు రెగ్యులర్ ఎంపీడీవో లేకపోగా సూపరింటెండెంట్ మహేందర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్నారు. గాదిగూడ ఎంపీడీవో రామేశ్వర్ ఇటీవల సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ రెండు మండలాలను మినహాయిస్తే మిగతా 15మంది ఎంపీడీఓలు జిల్లా వాసులు కావడంతో పాటు దీర్ఘకాలంగా ఒకే చోటపనిచేస్తున్నారు. ఇలాంటి వారి వివరాలతో కూడిన నివేదికను సిద్ధం చేసిన అధికారులు జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ప్రభుత్వ ఆదేశాలతో వీరంతా ఇతర చోటుకు బదిలీపై వెళ్లక తప్పని పరిస్థితి.

జోరుగా పైరవీలు

ఎన్నికలతో ఎంపీడీఓలకు ప్రత్యక్షంగా ఎలాంటి సంబంధం లేకపోయినప్పటికి వారిని కూడా బదిలీ చేయాలని ఈసీ భావిస్తోంది. బదిలీలు అనివార్యమైతే ఇదే తొలిసారి కానుంది. గతంలో ఓ సారి ఇలాగే ఎంపీడీఓలను బదిలీ చేసినప్పటికీ వెంటనే యథాస్థానానికి తిరిగి బదిలీ చేశారు. కానీ ప్రస్తుతం అలాంటి పరిస్థితి ఉండకపోవచ్చనే చర్చ సాగుతోంది. ఈసీ బదిలీలు జరిగితే కనుక దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందనే ఉద్దేశంతో కొంతమంది పైరవీలకు తెరలేపినట్లుగా తెలుస్తోంది. సమీపంలోని నిర్మల్, నిజామాబాద్ జిల్లాలోని తమకు అనుకూలమైన చోటకు బదిలీ చేసేలా రాజకీయంగా పైరవీలు సాగిస్తున్నట్లు ప్రచారం. ఇదిలా ఉంటే తమ బదిలీని నిలుపుకునేందుకు కొంతమంది ఎంపీడీఓలు జిల్లాకు వచ్చిన పంచాయతీరాజ్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కలిసినట్లుగా తెలుస్తోంది. జిల్లాలోనే కొనసాగించేలా చూడాలని మంత్రిని వేడుకున్నట్లుగా సమాచారం.

జంగుబాయిని దర్శించుకున్న నీలాదేవి


ఆలయం వద్ద ఎస్టీ, ఎస్సీ సభ్యురాలు

సిరికొండ: గిరిజన ఆదివాసీల ఆరాధ్య దైవమైన జంగుబాయి దేవతను ఎస్సీ, ఎస్టీ సభ్యురాలు కుంరం నీలాదేవి బుధవారం ఆసిఫాబాద్ జిల్లా కోట పరందోలిలోని జంగుబాయి గుహను దర్శించుకున్నారు. జంగుబాయి ఆదివాసీల ఆరాధ్య దైవమని, ప్రతీ ఏడు జంగుబాయిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటానని తెలిపారు. ఆమెతో పాటు ఆదివాసీ సంఘం సభ్యులు పెందుర్ లక్ష్మణ్, పెందుర్ బాపురావు, సీడం మనోహర్, పెందుర్ కేశవ్ ఉన్నారు.

'దేశ భవిష్యత్ నిర్మాతలు విద్యార్థులే'

మంచిర్యాలఅర్బన్: దేశ భవిష్యత్ నిర్మాతలు విద్యార్థులేనని కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఈసం నారాయణ అన్నారు. బుధవారం మంచిర్యాల పట్టణంలోని వివేక వర్ధిని డిగ్రీ, పీజీ కళాశాలలో ఆదిలాబాద్, నిర్మల్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల ప్రోగ్రాం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సామాజిక చైతన్యానికి, సంఘ సేవలో విద్యార్థి దశ నుంచే భాగస్వాములు కావాలన్నారు. తోటి వారికి సహాయపడేలా కేంద్ర ప్రభుత్వం 1969లో జాతీయ సేవా పథకాన్ని ప్రారంభించిందన్నారు. విద్యార్థులు తమ కళాశాల పరిధిలోని గ్రామాలను దత్తత తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించేలా చొరవచూపాలన్నారు. పారిశుధ్యం, సంపూర్ణ అక్షరాస్యత, వయోజన విద్య, అంటువ్యాధులు, మూఢనమ్మకాలు, జనాభా నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా కన్వీనర్ డా.చంద్రమోహన్ గౌడ్, ఆసిఫాబాద్ జిల్లా కన్వీనర్ తిరుపతి, నిర్మల్ జిల్లా కన్వీనర్ మురళి, ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కోఆర్డినేటర్ నారాయణ

ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు

- ప్రజావేదికల్లో వివరాలు వెల్లడించిన డీఆర్‌డీవో

ఖానాపూర్: ఉపాధిహామీ పథకం కింద 2022-23లో రూ.4,54,08,974తో చేపట్టిన పనుల్లో అక్రమాలు బయటపడ్డాయి. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం రాత్రి 8 గంటల వరకు ప్రజావేదిక నిర్వహించారు. డీఆర్డీవో విజయలక్ష్మి వివరాలు వెల్లడించారు. పనుల్లో భాగంగా రూ.4,22,11,212 నగదు కూలీలకు చెల్లించగా, రూ.29,97,762 మెటీరియల్ కోసం చెల్లించినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో రూ.4,61,84,115 నిధులతో చేపట్టిన పనుల రికార్డులను సంబంధిత అధికారులు తనిఖీ బృందానికి ఇవ్వలేదని పేర్కొన్నారు. అటవీ శాఖకు చెందిన రూ.86,68,541 పనుల రికార్డులు సైతం అందించలేదన్నారు. గతేడాది జరిగిన ప్రజావేదికలో రూ.23,81,371 విలువైన పనులకు సంబంధించి నిధుల దుర్వినియోగంపై క్వాలిటీ కంట్రోల్‌కు నివేదించామని తెలిపారు. దానికి సంబంధించి రిపోర్టు


అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఆర్డీవో

రావాల్సి ఉందన్నారు. గతేడాది దుర్వినియోగమైన నిధుల నుంచి రూ.7,24,214 నగదు రికవరీ చేశామని తెలిపారు. అలాగే ఈ ఏడాది మొత్తం రూ.16,114 రికవరీకి ఆదేశించామని, రూ.39వేలు పెనాల్టీ విధించినట్లు పేర్కొన్నారు. కాగా.. ఈజీఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పని ఒత్తిడి ఉంటుందని చెప్పడంతో వారిపై డీఆర్డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. జవాబుదారీగా ఉండాలని, ఇలాంటి సమాధానాలు చెప్పొద్దని సూచించారు. ఎంపీపీ మోహిద్, వైస్ ఎంపీపీ వాల్‌సింగ్, హెచ్‌ఆర్ మేనేజర్ సుధాకర్, ఎస్టీఎం దత్తు, అంబుడ్స్‌మెన్ నవీన్, బీఏవో లక్ష్మణ్, ఎంపీడీవోలు మల్లేశ్, వనజ, ఏపీవోలు రమేశ్, ప్రమీల ఉన్నారు.

జాతీయ సెమినార్‌కు ఎన్‌సీడీ పీవో

ఆదిలాబాద్‌టౌన్: వాతావరణ మార్పులతో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలపై దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు జిల్లా మలేరియా నివారణ, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మెట్‌పెల్లివార్ శ్రీధర్ హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రం నుంచి భద్రాద్రి కొత్తగూడెం, సంగారెడ్డి, హన్మకొండ, ఆదిలాబాద్, నల్గొండ జిల్లాల పీవోలు వెళ్లారు. ఈ సెమినార్ మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఆయా ప్రాంతాల్లో వాతావరణ మార్పులతో ఎలాంటి వ్యాధులు సంభవిస్తాయని, వాటి నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర వాటిపై నిపుణులు సూచనలు అందించనున్నారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు


భూమేష్‌తో కుటుంబీకులు

ఖానాపూర్: పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన వడ్యాల భూమేష్ గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. ఇటీవల కుటుంబీకులు భూమేష్‌ను హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించగా బ్రెయిన్ ఆపరేషన్ చేయించాలని, ఆపరేషన్‌కు రూ.6లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. నిరుపేద అయిన భూమేష్‌కు రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబమని, ఎవరైనా దాతలు స్పందించి ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. భర్త ప్రాణాలను కాపాడేందుకు దాతలు ముందుకు రావాలని అతడి భార్య, కుమారుడు, కూతురు వేడుకుంటున్నారు. దాతలు ఫోన్ పే నంబర్ 73307 62164లో సాయాన్ని అందించాలని కోరుతున్నారు.

విచారణ పూర్తి కాకుండానే టీచర్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

- విద్యాశాఖ తీరుపై సర్వత్రా విమర్శలు

ఆదిలాబాద్‌టౌన్: నేరడిగొండ మండల కేంద్రంలో ఇటీవల విద్యార్థినిల పట్ల అసభ్యంగా ప్రవర్తించారనే ఆరోపణలతో ఓ ఉపాధ్యాయుడిపై విద్యాశాఖ అధికారులు సస్పెన్షన్ విధించిన విషయం తెలిసిందే. అయితే విచారణ పూర్తి కాకుండానే సదరు ఉపాధ్యాయుడిపై విద్యాశాఖ అధికారులు బుధవారం సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. అయితే ఆ ఉపాధ్యాయుడు పాఠశాలకు వెళ్లి విధుల్లో చేరినట్లు సమాచారం. ఈ ఘటనపై అప్పట్లో విద్యాశాఖ అధికారితో పాటు పలువురు ఆ పాఠశాలకు వెళ్లి సంఘటన వివరాలు విద్యార్థులు, ఉపాధ్యాయుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై ఐసీపీఎస్ అధికారులు సైతం అక్కడికి వెళ్లి ఆరా తీశారు. సదరు ఉపాధ్యాయుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయించారు. రాష్ట్ర బాలల పరిరక్షణ అధికారి సైతం ఈ సంఘటనపై సీరియస్ అయ్యారు. విచారణ చేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక కోరిన విషయం విదితమే. విచారణ పూర్తి కాకుండానే ఉపాధ్యాయుడిని ఏ విధంగా తిరిగి విధుల్లోకి తీసుకుంటారని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఆ ఉపాధ్యాయుడిని అదే పాఠశాలలో తిరిగి విధుల్లోకి తీసుకోవడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. విచారణ పూర్తయిన తర్వాతే సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నారు. వెంటనే విద్యాశాఖ అధికారులు స్పందించకుంటే ఆందోళనకు దిగుతామని విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీతను వివరణ కోరగా, చార్జెస్ ఫ్రేమ్ చేసిన తర్వాత పెండింగ్ ఎంక్వైరి కింద ఆ ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ ఎత్తివేశామని తెలిపారు. ఏవైన అభ్యంతరాలు వస్తే ఆ ఉపాధ్యాయుడిని మరో పాఠశాలకు పంపిస్తామని పేర్కొన్నారు.

నిప్పంటుకుని వృద్ధురాలి మృతి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి గ్రామానికి చెందిన మందుల గంగమ్మ (68) ప్రమాదవశాత్తు నిప్పంటుకుని చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గంగమ్మకు ఒక కుమారుడు ఉన్నారు. ఆయన పెళ్లి చేసుకుని భార్యతో కలిసి వేరుగా నివాసముంటున్నాడు. గంగమ్మ భర్త గతంలో చనిపోవడంతో ఒంటరిగా నివాసం ఉంటూ వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. జనవరి 27న ఆమె ఇంట్లో దేవుడి గుడిలో దీపం ముట్టించింది. దీపం ఒంటిపై ఉన్న కొంగుకు అంటుకుంది. దీంతో ఆమెకు గాయలు కావడంతో చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.